స్వర్గాదపి గరీయసీ

(ఆధునిక సామాజిక పద్యనాటకం)

(ప్రజ–పద్యం వారు నిర్వహించిన పోటీలో
ద్వితీయ బహుమతి పొందిన నాటకం)

రచన

డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య,

ప్రచురణ:

టేకుమళ్ళ ప్రచురణలు

16–6–81 శ్రీనివాస అగ్రహారం

నెల్లూరు - 524 001 (ఆంధ్రప్రదేశ్)

స్వర్గాదపి గరీయసీ (C)

(ఆధునిక సామాజిక పద్యనాటకం)

రచన : డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య

ప్రతులకు:

డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య

16-6-81 శ్రీనివాస అగ్రహారం

నెల్లూరు - 524 001, ఆం.ప్ర.

ముద్రణ : ప్రథమ ముద్రణ

క్రోధినామ సంవత్సరం, చైత్రమాసం

ఏప్రిల్ 2024.

ప్రతులు : 300 కాపీలు

మూల్యం: రూ. 100/-

రచయిత చిరునామా:

డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య

3 వ మెయిన్ రోడ్డు

16-6-81 శ్రీనివాస అగ్రహారం

విజయమహల్ దగ్గర

నేతాజి పైలట్ స్కూల్ ప్రక్కన

నెల్లూరు - 524 001, ఆం.ప్ర.

ఈమెయిల్: tekumalla.venkatappaiah@gmail.com

ఫోను: 9490400858, 91105 80418

ముద్రణ: బృందావన్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ (94402 18158)

డి.టి.పి: డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య

కవర్ డిజైన్: శ్రీ జోస్యుల వేణుగోపాల్, విజయవాడ. (94404 36806)

__ప్రార్థన__

పరా బ్రహ్మ పరమేశ్వర

పురుషోత్తమ సదానంద

పరంజ్యోతి పరాత్పర

పతిత పావన స్వప్రకాశ

వరదాయక సకలలోక

వాంఛిత ఫల ప్రదాయా

పాహి పాహి మాం పాహి

– చందాల కేశవదాసు (1876–1956)

తొలి తెలుగు సినీగీత రచయిత

*****

గమనిక: ఈ నాటకం ప్రదర్శించదలచినవారు రచయిత అనుమతి లిఖిత పూర్వకంగా తీసుకోవాలి. అనుమతిలేకుండా ప్రదర్శించడం చట్టరీత్యా నేరం కూడా!

– డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య

అంకితం

టేకుమళ్ళ సుబ్రహ్మణ్యంగారు

మా తండ్రిగారైన టేకుమళ్ళ సుబ్రహ్మణ్యంగారు, బిట్రగుంట సమీపములోని అల్లిమడుగు గ్రామములో, పోస్ట్ మాస్టరుగాను, రామాలయ అర్చకునిగాను, ఉపాధ్యాయునిగాను, విధులు నిర్వర్తించి అనారోగ్యం వల్ల 62 సం.ల వయసులోనే స్వర్గస్తులైనారు.

వారికి భక్తిపూర్వకంగా ఈ నాటకం అంకితం

\- టేకుమళ్ళ వెంకటప్పయ్య

తెలుగు సాంఘిక నాటకం - సామాజిక చైతన్యం

సంఘంలో దురాచారాలను రూపుమాపి, సంఘాన్ని సంస్కరించడం కోసం అనేకమంది కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు, రాజనీతిజ్ఞులు అనంతమైనకృషి చేసిన విషయం విదితమే! రంగస్థలంపై ఒక దురాచారం లేదా ఒక సమస్యను కళ్ళకు కట్టినట్లు చూపిస్తూ చేయబడే నాటకప్రదర్శన ప్రేక్షకుణ్ణి కరిగిస్తుంది. కదిలిస్తుంది. ఆలోచనలను రేకెత్తిస్తుంది. కర్తవ్యాన్ని నిర్దేశిస్తుంది. ప్రేక్షక హృదయాలపై చెరగని ముద్రవేస్తుంది. సాహిత్యమంటే సమాజ ప్రతిబింబమే కదా! కాబట్టి సమాజంలో వచ్చే ప్రతి మార్పు కాలానుగుణంగా సాహిత్యంలో చోటుచేసుకుంటుంది. "మారుతున్న కాలానికి భాష్యంగా నిలిచే కళారూపం నాటకమైతే, మానవ జీవిత లోలోతులను అన్వేషించేది, వ్యాఖ్యానించేది నాటక రచన" అంటారు. అలాగే దైనందిన జీవన సమస్యలను బలంగా చిత్రించేదీ నాటకమే!

నాటకాంతంహి సాహిత్యం అని ఆర్యోక్తి. నాటకాన్ని చదివిన తర్వాతనే సాహిత్యాధ్యయనం సంపూర్ణంగా జరిగినట్టని పెద్దల ఉద్దేశం. ప్రాచీన కాలంలోనే కవికుల గురువైన కాళిదాసు, భాసుడు, శూద్రకుడు, భవభూతి, శ్రీహర్షుడు వంటి సంస్కృత కవులు నాటకాలు రచించారు. సంస్కృతకవులు నాటకప్రక్రియకిచ్చిన ప్రాముఖ్యత, తెలుగుకవులివ్వక పోవడానికి కారణ మేమిటో తెలియదు.

ధనంజయుడు రస, వస్తు, నాయకాది భేదాలను బట్టి ఈ రూపకాలను పది రకాలుగా విభజించాడు. వాటిలో మొదటిది నాటకం. నాటకంలో కథ (ఇతివృత్తం) ప్రసిద్ధంగా ఉండాలి. నాయకుడు ధీరోదాత్తుడై ఉండాలి. ఇందులో శృంగారం లేదా వీరం ప్రధానరసమై ఉండాలి. నాటకం రూపకాలన్నింటిలోకి విశాలమైనది. ఇందులో 5-10 అంకాలుంటాయి. ఒకేసమయంలో రంగస్థలంపై నాలుగైదు పాత్రలకన్నా ఎక్కువ ఉండకూడదు. ప్రతి అంకంలో నాయకుడో, నాయికో కనిపించాలి. దీనిని నాటకం అన్నారు. మిగిలినవి ప్రకరణం, భాణము, ప్రహసనం, డిమం, వ్యాయోగం, సమవకారం, వీథి, అంకం, ఈహామృగం.

రావిపాటి త్రిపురాంతకుడనే కవి సంస్కృతంలో వ్రాసిన 'ప్రేమాభిరామం' అనే నాటకానికి అనుసరణగా తెలుగులో చేసిన రచనే 'క్రీడాభిరామం' అని స్వయంగా వల్లభరాయడే చెప్పుకున్నాడు. ధనంజయుని వర్గీకరణ దృష్ట్యా, 'వీధి' నాటకం కాదు. దశరూపకాలలో ఒక ప్రక్రియ. అయితే తెలుగులో లభించే తొలి నాటకం అదేననుకున్నా తప్పేమీ లేదు.

తెలుగునాటకం పుట్టుక గురించి, ఈనాటి వరకూ జరిగిన ప్రయోగదశల గురించి ఈ సందర్భంగా సంగ్రహంగా తెలుసుకోవడం సముచితం. ఆ విషయమై ఒక విహంగ వీక్షణయత్నం చేస్తున్నాను. ప్రాచీన కాలం నుండి మన తెలుగు నేలపై కొరవంజి, యక్షగానం, తోలుబొమ్మలాట, వీధి భాగవతం, పగటివేషాలు ఉన్న సంగతి మనకు తెలిసిందే. ఇవన్నీ ప్రజలకు వినోదాన్ని విజ్ఞానాన్ని అందించి నిలిచాయి. నాటక ప్రక్రియ పూర్తి స్వరూపం బీజంపోసుకున్నది పంతొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్థంలోనే అని తెలుస్తున్నది.

అమలాపురంలోని సంస్కృత పండితుడైన శ్రీ కోరాడ రామచంద్రశాస్త్రి "మంజరీ మధుకరీయం" అనే నాటకాన్ని 1860 సం.లో రచించారు. మన తెలుగులో ఇప్పటివరకూ లభించిన ఆధారాల ప్రకారం అదే తొలి నాటకం. దానిలోని పద్యాలు, గద్యలు అత్యంతకఠిన సమాసభూయిష్టమవడం వల్ల గావచ్చు, అప్పటికి ప్రదర్శనా పద్ధతులు తెలియకపోవడం వల్ల కావచ్చు, ఆ నాటకం ప్రదర్శనకు మాత్రం నోచుకోలేదు. ఒక దశాబ్దం గడచిన అనంతరం 1871 సం.లో కొక్కొండ వెంకటరత్నం రచించిన "నరకాసుర విజయ వ్యాయోగం" అనే నాటకం వచ్చింది. ఇది సంస్కృత నాటకానికి తొలి అనువాదం. కొక్కొండ వారి బాటలో మరికొంతమంది నడిచారు. 1872లో అనువాదం ఒక మలుపు తీసుకుని వావిలాల వాసుదేవ శాస్త్రిగారు, షేక్స్పియర్ రచించిన జూలియస్ సీజర్ నాటకాన్ని తెలుగులో "సీజరు చరిత్ర" పేరుతో అనువదించారు. ఇది పూర్తిగా పద్య నాటకం. ఆయనే "నందక రాజ్యం" అనే నాటకాన్ని కూడా రచించారు. ఇది పూర్తిగా స్వతంత్ర సాంఘిక నాటకం. తొలి తెలుగు సాంఘిక నాటకంగా దీన్ని సంభావిస్తున్నారు.

1880 వ సం.లో తెలుగునాటక రంగం రెండవదశ. ప్రప్రథమంగా తొలి తెలుగు నాటకం ప్రదర్శనకు నోచుకుంది. కందుకూరి వీరేశలింగం పంతులు "వ్యవహార ధర్మబోధిని" అనే ప్రహసనాన్ని రచించి విజయనగరం మహారాజా వారి పాఠశాల విద్యార్థులచే ప్రదర్శింపజేశారు. పంతులుగారు నాటక సమాజ స్థాపనకు నాంది పలికారు. ఆవిధంగా తెలుగు నాటకం ఒంటికాలుతో నడుస్తున్న తరుణంలో 1880 సం.లో మహారాష్ట్రకు సంబంధించిన ధార్వాడనాటక సమాజంవారు తెలుగునేలపై విస్తృతంగాపర్యటించి అనేక హిందీనాటకాలను ప్రదర్శించారు. ఆ ప్రదర్శనలను తిలకించిన తెలుగు కవులు, కళాకారులు మహాదానందం చెంది, తాము కూడా అలాంటి నాటకాలను తెలుగులో రచించాలని, ప్రదర్శించాలని ఉవ్విళ్ళూరారు. ఆనాటినుండి తెలుగు వారు అనేక ప్రయోగాలను చేశారు. కందుకూరి వారు 16 నాటకాలను, 50కి పైగా ప్రహసనాలను రచించారు. వ్యవహార ధర్మబోధిని, బ్రహ్మ వివాహం, అభిజ్ఞాన శాకుంతలం వీటిలో ఉత్తమమైనవి. వీరి శాకుంతలం నాటకం వందేళ్ళ కాలానికంటే ఎక్కువ కాలం ప్రదర్శనలనందు కొన్నది.

అప్పటినుండి గుంటూరులో కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, రాజమండ్రిలో వడ్డాది సుబ్బరాయకవి, రాయలసీమలో శ్రీధర్మవరం రామ కృష్ణమాచార్యులవారు తెలుగునాటకం నిలబడడానికి అనంతకృషి చేశారు. వడ్డాది వారి వేణీసంహారం మూడు దశాబ్దాల కాలం ప్రదర్శింపబడింది. తెలుగులో పద్యాలను రంగస్థలంపై పఠించడం, ఆలాపించడం ప్రవేశపెట్టిన ప్రథములుగా వారిని భావిస్తున్నారు. ధర్మవరం వారైతే పద్యాలతో పాటు పాటలను, డ్యూయెట్లను కూడా రంగస్థలంపై ప్రదర్శింపజేసి కొత్త పుంతలు త్రొక్కారు. తొలిసారి ఆత్మసంభాషణల పద్ధతి (పాత్రలు మనసులో చిన్నగా మాట్లాడుకునే పద్ధతి), మనస్తత్వ చిత్రణ, భావ సంఘర్షణలకు అంటే ఒక్కమాటలో చెప్పాలంటే ఈనాటి చలనచిత్రాలకు, వివిధఛానళ్ళలో వస్తున్న ధారావాహికలకు సరిసమానంగా పాత్రలను రంగస్థలంపై నడిపించారు. నటులు కేవలం సంభాషణలు పలకడమే కాకుండా ఫీలింగ్సు చూపించడం నేర్పించారు. అధునిక సమస్యలను, జాతీయ భావాలను తమ నాటకాలలో ప్రవేశపెట్టిన

ప్రజ్ఞాధురీణుడు. విషాదాంత నాటకాలకు కూడా ఆద్యులు వీరే. అలాగే రాయలసీమలో కోలాచలం శ్రీనివాసరావు 30 నాటకాలను రచించారు. "రామరాజు" వీరి ప్రసిద్ధనాటకం. వీరు 'చారిత్రక నాటక పితామహుడు' అనే బిరుదు సంపాయించుకొన్నారు. వీరు 'ప్రపంచ నాటక చరిత్ర' రచించి గొప్ప కీర్తిని సంపాదించారు. 1897 సం.లో వేదంవారి కలం నుండివెలువడిన మరో మహా చారిత్రక నాటకం ప్రతాపరుద్రీయం. 1900-1925 మధ్య పురాణ నాటక యుగంగా అభివర్ణించారు. కపిలవాయి రామనాథ శాస్త్రి, అద్దంకి శ్రీరామమూర్తి, సూరిబాబు, నెల్లూరి నాగరాజారావు, దైతా గోపాలం వంటి ఎందరెందరో ప్రసిద్ధి పొందారు.

గురజాడ వేంకట అప్పారావు గారి కలంద్వారా వెలువడిన కన్యాశుల్కం (1892) సాంఘిక నాటకం తెలుగు నాటక రంగంలో ఒక మైలురాయి. ప్రస్తుతం ఆధునిక సామాజిక పద్యనాటకం గురించి మాట్లాడుకోవలసి వస్తే కాళ్ళకూరి నారాయణరావు గారి చింతామణి (1921), వరవిక్రయం (1922) అనే రెండు పద్యనాటకాలు ఆంధ్రలోకాన్ని దాదాపు ఏలాయనే చెప్పవచ్చు. వారు మధుసేవ (1926) అనే నాటకం రచించినా అంత గొప్పగా ప్రదర్శనలకు నోచుకోలేదనే చెప్పాలి. నవీన భావాలను, సంస్కరణవాదాన్ని సంప్రదాయపద్ధతిలో జోడించి, అటు సంప్రదాయవాదులను, ఇటు అభ్యుదయ వాదులను ఏక కాలంలో ఆకర్షించి పండిత పామరుల చేత మెప్పు పొందిన కవి కాళ్ళకూరివారు. చింతామణిలో వేశ్యావృత్తి నిర్మూలనం ఇతివృత్తం కాగా, వరవిక్రయంలో వరకట్నం దురాచారం వల్ల కలుగుతున్న దుష్ఫలితాలను కళ్ళకు కట్టారు కాళ్ళకూరి. మనసుకు హత్తుకునే పద్యాలతో, మనోజ్ఞమైన సంభాషణలతో, నిండైన నాటకీయతతో, సహజమైన పాత్రచిత్రణతో, అర్థవంతమైన సన్నివేశాల రూపకల్పనతో, చమత్కృతితో సాంఘికప్రయోజనంగల నాటకాలను రచించారు.

తెలుగు నాటక రంగంలో ఎన్.ఆర్.నంది రచించిన "మరో మొహంజోదారో" సంచలనాత్మకమైన నాటకం. ఐతిహాసిక నాటక విధానం (ఎపిక్ థియేటర్) తో వ్రాయబడ్డ నాటకం. తాదాత్మ్య విచ్ఛేదనం (ఎలియెనేషన్) అడుగడుగునా కనిపిస్తుంది. తెలుగులో 'ఫ్రీజ్ షాట్ పద్ధతి' ని ప్రవేశపెట్టింది కూడా వీరే. ఈవిధానం అనేక

నాటకాలలో తదనంతర కాలంలో వాడబడింది. అలాగే భమిడిపాటి రాధాకృష్ణ వ్రాసిన "కీర్తిశేషులు" నాటకం ఈనాటికి, ఏనాటికి మరచిపోలేని నాటక రాజం. తెలుగు సాంఘికనాటకరంగాన్ని ఎంతోమంది రచయితలు నూతనకథాంశాలతో, ఇతివృత్తాలతో, ప్రదర్శానానుకూలమైన నాటకాలు, నాటికలు రచించి సమాజానికి సందేశాన్ని అందించి ఈ రంగాన్ని సుసంపన్నం చేశారు. అందరి పేర్లు స్మరించుకోలేక పోవచ్చు. కానీ అందరికి వందనాలు.

మరొక గమనించదగ్గ విశేషమేమిటంటే, సామాజిక ఉద్యమకారులు కళాకారులకు ప్రేరణగా నిలుస్తారు. కళాకారులు ఉద్యమానికి కొత్త ఊపునూ, వేగాన్ని ఇస్తుంటారు. ఇవి పరస్పర సంబంధమైనవిగా, గతితార్కికమైనవిగా ఉంటాయి. ఉద్యమ ప్రభావం సాహిత్యం మీద ఉంటుంది, ప్రజలు ఆలోచించడానికి అది సహాయపడుతుంది. ఉద్యమ స్ఫూర్తితో, అవసరంతో, సారస్వతం నిజమైన సాహిత్యంగా పుట్టుకొస్తుంది. నిజమైన సృజనాత్మకత అలాంటి సాహిత్యంలోనే ఉంటుందని నమ్మేవారిలో నేనొకణ్ణి.

ఈ "ఆధునిక సామాజిక పద్యనాటక స్పర్ధ" సందర్భంగా ఒక్క విషయం మనవి చేసుకోవాలని అనుకుంటున్నాను. 'చింతామణి' నాటకంలోను, 'వరవిక్రయం'లోను కాళ్ళకూరివారు ఎక్కువగా సీసపద్యాలు, సాధారణ ఉత్పల, చంపక మాలా వృత్తాలను, ఆటవెలదులను, తేటగీతులను ఉపయోగించి రచించారు. ఎక్కువగా వ్రాయబడిన సీసపద్యాలు సంగీతంలో వరసకట్టి పాడుకోవడానికి చక్కగా ఉంటాయని మన పౌరాణిక, చారిత్రాత్మక, నాటకాలు అప్పటికే నిరూపించాయి. అందువల్లనే కాళ్ళకూరివారు సీసాలకు, ఆటవెలదులకు అంత ప్రాధాన్యత ఇచ్చారన్న భావన నాలో కలిగింది. వీరి పద్యరచనలో జటిలత్వం కాని, అన్వయకాఠిన్యం కాని కనిపించవు. కొన్ని పద్యాలైతే ఇవి పద్యరూపంలో ఉన్న గద్యాలా? అనే అనుమానం కలుగుతుంది. ఉదాహరణకు ఒక్క పద్యం మాత్రం చూద్దాం. "తే.గీ. చదివితి సమస్త శాస్త్రముల్ చదివి యేమి ఫలము? తుదకిట్లు చెడుదారిబడి చరించి, జనకు నిల్లాలిని గూడ జంపుకొంటి! తరుగబోనట్టి ఘోర పాతకము గంటి" అని బిల్వమంగళుడు తండ్రి, భార్యల మరణానంతరం విలపిస్తాడు. ఈ పద్యం విన్నవారికి సూటిగా అర్థమై, పామరుడికి కూడా సులభబోధకంగా నిలిచింది.

కాళ్ళకూరివారి నాటక శైలికి ఒక ప్రత్యేకత ఉంది. కవిగా సమాజానికి ఓ మంచి విషయాన్ని చెప్పాలి. ఆ విషయం ప్రేక్షకుల హృదయలలో చిరస్థాయిగా నిలిచిపోవాలి అనేది ఆయన ఆశయం. ఈయన రచించిన సాంఘిక నాటకాలలో ఒక చక్కని సంప్రదాయం ఏమిటంటే, నాటకాంతంలో ప్రధాన పాత్రచేత నీతిని బోధించడం. ఇందువల్ల కవి ఆశయం నెరవేరుతుంది. నారాయణరావు గారు పద్యరచనలో కాని, సంవాదంలోకాని, సరళ సుందరమైన భాష వాడారు. ప్రేక్షకుల హృదయాలలోకి సూటిగా దూసుకుని పోవడం ఈ పద్యాల ప్రత్యేకత. అందుకే వారి నాటకాలు చిరస్థాయిగా ఈనాటికి నిలిచిపోయాయి. తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగ విజయాల తర్వాత ఆంధ్రదేశంలో ఎక్కువగా ప్రదర్శితమైనవి వీరి నాటకాలే అన్నది కాదనలేని సత్యం. కాళ్ళకూరివారి కాళ్ళకు శిరసువంచి నమస్కరిస్తూ, వారి బాటను అనుసరిస్తూ, వారి సామాజికచైతన్యాన్ని అనుసరిస్తూ, ఈ “స్వర్గాదపి గరీయసీ” నాటకాన్ని మీ ముందుంచుతున్నాను.

చివరిగా ఒక్క మాట. నాటక రచయితకు జీవితం పట్ల అవగాహన మాత్రమే చాలదు. అనుభవం ఉండాలి. సమాజాన్ని అన్నికోణాలనుంచీ పరిశీలన చెయ్యగలిగి ఉండాలి. విభిన్న మానవ ప్రవృత్తులను, మానవ సంబంధాలను, సాధకబాధకాలను సంపూర్ణంగా అధ్యయనం చేయాలి. అప్పుడే సమస్త అనుభూతులనూ జీవన సత్యాలుగా వెల్లడించే శక్తి నాటక రచయితలకు అలవడుతుందని నా ప్రగాఢ విశ్వాసం. నాకృషిని అభినందిస్తారని, ఆశీర్వదిస్తారని ఆశిస్తూ....

- **డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య.**

అవధానభారతి, సాహితీ చతురానన,
ఛందోవైవిధ్య నిష్ణాత, ఛందస్సవ్యసాచి,
స్వర్ణకంకణ, కవిగండపెండేర గ్రహీత
విద్వాన్ చక్రాల లక్ష్మీకాంతరాజారావు, ఎం.ఎ.,
విశ్రాంత సంస్కృతాంధ్రోపన్యాసకులు
హైదరాబాదు. చరవాణి: 92913 33880

భావ ప్రదర్శన

మనదేశంలో భాషలెన్నో. అలానే ప్రక్రియలు కూడా! పద్య గద్య చంపూ గేయ బృహత్కథా సంక్షిప్త కథాది విస్తృతములైన విధానములుగా ప్రక్రియలు గోచరిస్తున్నాయి. అందు అన్నింటిలో నిష్ణాతులైనవారిని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అట్లు లెక్కపెట్టదగిన వారిలో మన శ్రీ టేకుమళ్ళ గారొకరు.

శ్రీ టేకుమళ్ళ వారికి సరస్వతీమాతృ కటాక్షం లభించింది. అందుకు తగ్గట్టుగా ఓపిక ఉంది. దానితో బాటు ధైర్యముంది. ఎవరైనా ఈ ప్రక్రియలో తమకు కవిత కావాలని అడిగినా లేదా ఏదైనా ప్రక్రియలో పోటీతనము ప్రదర్శించవలసి వచ్చినా, వీరు అందులకు తలనూపి, ఆ ప్రక్రియను గూర్చి ఆలోచించి, ముడిసరుకును తయారు చేసుకొని, తనకు తెలిసిన కవి, పండితులను సంప్రదించి, తన భావము వారికి తెలియజేసి, వారి సమ్మతినిపొంది, తత్కార్యమందు నిర్విరామముగా పాల్గొని, దానిని సిద్ధము జేసి, సకాలములో దానినడిగినవారికి అందించి మెప్పు పొందగలవారు.

అందుచే వీరు ప్రతి సాహితీ ప్రక్రియ యందు పాల్గొనుచూ, తమ ప్రతిభను, పాండిత్యమును, సమయ పాలనమును, క్రమశిక్షణను, ఇలా తత్ సాహితీ ప్రక్రియకు తగిన విధముగా వర్తిల్లుచు, మెప్పులను గొనుచుంటారు.

ప్రజ–పద్యం నాటకపోటీ విషయం విన్నారు. ఆ ప్రకటన చూశారు. పాల్గొనవలెనను ఆశ చిగురించింది. ఆలోచన మొదలైంది. కథా విషయము దొరికినది. నేటి సమాజమున ఒక సమస్యగా ఉన్న దానిని గ్రహించి "స్వర్గాదపి గరీయసీ" అను పేరున ఐదు అంకాల నాటకమును వ్రాశారు.

నాటక లక్షణములేవో వీరికి తెలుసు. కావున ఆయా లక్షణములను తు.చ. తప్పకుండా యిందు పాటించారు. నాటకమునకు మూడు అంకములకన్న ఎక్కువ అంకములు ఉండవలెనని, కథ పూసలను దారము యిమిడినట్లు కొనసాగవలెనని, పాత్రోచిత భాష ఉండవలెనని, ప్రదర్శన యోగ్యత కలిగి ఉండవలెనని, సమాజాభివృద్ధికి తోడ్పడు అంశములుండవలెనని, ఇలా..అన్నింటినీ, పోటీ నిర్వహించువారికి అనుగుణంగా వ్రాయవలెనని, యిలా యోచన చేస్తూ తన గమనాన్ని సాగించుచుంటారు.

ఈ నాటకమున కథాంశము నేటి యువతరం ఆలోచన. మాతృదేశముపై కాక విదేశములపై మోజు. ధనార్జన జేయు సంకల్పము. విదేశీ ప్రయాణము, అటు ఒక విదేశీ యువతితో వివాహము, అటనే జీవన యానం. ఇట నున్న తల్లిదండ్రులను మరచిపోవడం,ఇలా కొనసాగుతున్న తరుణంలో, టేకుమళ్ళవారు తత్కథను మలుపు త్రిప్పి, విదేశీ యువతియైన ఆ యింటి కోడలు అత్తవారింటి సంప్రదాయమును గౌరవించి, భారతదేశమునకు రావడం, భర్త మనసు మార్చి ఇచ్చటనే ఉండునట్లు చేయడం అనే మంచి యూహకు నాంది చుట్టి నాటకమును వ్రాశారు.

ఇందులో పాత్రోచిత భాషతో బాటు, సందర్భోచిత పద ప్రయోగాలు, పద్య రచనలు, జాతీయాలు, సామెతలు, భారతీయ సంప్రదాయములో గల గొప్పదనము, విదేశాలపై మోజుపడే వారికి హెచ్చరికలు యిలా ఎన్నో ఉన్నాయి.

ఈ నాటకమును పౌరాణిక నాటకమువలె ప్రదర్శించవచ్చు. యువతరాన్ని మార్చవచ్చు. భారతీయ సంస్కృతి ఘనత చూపవచ్చు, ప్రజలలో దేశభక్తిని కలిగించవచ్చు.

ఈ నాటకమును చదివే పాఠకులు, ప్రదర్శనగా చూసే ప్రేక్షకులు, కవిని మనసారా అభినందించవచ్చు. ఆ రీతిగా నాటక నిర్మాణం జరిగినది.

ఆ.వె. టేకుమళ్ళ వారి ప్రాకట పాండితీ
వైభవమ్ము పొగడ భాష చాల
దయ్యో! వారి తలపులందు వాణి మనుచు
మెచ్చు భావ గరిమ నిచ్చు చుండు!

శ్రీ టేకుమళ్ళ వెంకటప్పయ్య మరిన్ని సాహితీ ప్రక్రియల్లో కృషి చేయాలని ఆశిస్తూ...ఆశీర్వదిస్తూ...

హైదరాబాదు,
09-04-2024.

ఇట్లు
బుధజన విధేయుడు
చక్రాల లక్ష్మీకాంత రాజారావు.

"నవ్య నాటక ప్రయోగం - స్వర్గాదపి గరీయసీ"

"తథాపి కావ్యం ?...తయేవ పద విన్యాసాః ? తాయేవ2ర్థ విభూతయః ? తథా2పి కావ్యం భవతి ? నవ్యం , గ్రథన కౌశలాత్?" అని ఆలంకారికోక్తి. అంటే, అవే పదాలు , అవే అర్థాలు, ఐనప్పటికీ కావ్యం, కేవలం కవి రచన వల్లే నూతనత్వాన్ని సంతరించు కుంటుందనీ భావం. విశ్వనాథ వారు కూడా , కావ్యంలో నున్న నూరు పాళ్ళలో ఉన్న ప్రతిభ, తొంభైపాళ్ళు కవిదేననీ వారి రామాయణ కల్పవృక్షం లో స్పష్టీకరించారు. దృశ్య - శ్రవ్య కావ్యాలు రెండు విధాలు . ఇక్కడ కావ్యం అంటే దృశ్యమైన కావ్యమైన నాటకం అనుకుంటే, కవి తన చుట్టూ ఉన్న సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని తన కావ్యాన్ని అంటే నాటకాన్ని రూపొందించుకోవలసి ఉంటుంది. అది, కథా పరంగానూ, భాషా పరంగానూ, సందేశాత్మకంగానూ, సమాజంలో ఉన్న వారికి అర్థమయ్యే రీతిలోనూ , ఉండేటట్టు చూసుకోవాలి. అలా ఉంటేనే సమాజంలో ఉన్న ప్రతి స్త్రీ పురుషులు ఆ (ప్రక్రియ) నాటకం పట్ల ఆకర్షితులౌతారు. ఆ నాటకం పదికాలాల పాటు జీవించి ఉంటుంది . అలా ఎప్పుడో మన పెద్దలు రాసినవే, మన వరకే కాక, ముందు తరాల వారి వరకూ వెళతాయి. ఆ నాటకం సమాజానికి అర్థం కాక పోతే అది ఎంత గొప్ప కవి రాసినా ఆ కవి కాలంతోనే ఆగిపోతుంది.

(అ) కవి-నవ్యత కాబట్టి కవి ఎప్పుడూ నూతనంగా ఇలా ఆలోచించాలి. 1) ఎవరి కోసం రాస్తున్నాం ? 2) ఏ కాలంలో రాస్తున్నాం ? 3) ఎంత భాష వాడుతున్నాం? 4) మనం వాడిన భాష (పద్యం, వచనం) ఎదుటి వారికి (ప్రేక్షకునికి) అర్థం అవుతోందా? 5) మనం ఈ నాటకం ద్వారా ఇచ్చే సందేశం? / చెప్ప బోయేదేమిటి? ఇలాంటి ప్రశ్న లు కవి తనకు తాను వేసుకోవాలి. '

(ఆ) నవ్య మైన నాటకం అయితే ఈ ప్రశ్నలన్నీ ప్రస్తుత నాటకం "స్వర్గాదపి గరీయసీ' "రాసిన డా టేకుమళ్ళ వేంకటప్పయ్య తనకుతానుగా ముందే వేసుకున్నట్టు నా కనిపించింది. దానికి తోడు ఓ సదాశయం కోసం రాయబడింది. అదే...,

ప్రజు–పద్యం వారి నిర్దేశకత్వం . ఇది దీనికి ఆధారపీఠం అయ్యింది. డా.టేకుమళ్ళ వారు పద్యరచనలో సిద్ధ హస్తులు. అంతే కాకుండా వారి ఇతర గ్రంథ రచనల్లో ఏదో ఓ నవ్యత్వం కొట్ట వచ్చినట్టు కనిపిస్తోంది.

(ఇ) స్వర్గాదపి గరీయసి కొత్తదనానికి నిర్వచనం ఈ నాటకం . పేరు మనందరికీ బాగా పరిచయమైందే! జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ, అంటే, మనల్ని కన్న తల్లి, మనల్ని కన్న భూమి ఈ రెండు స్వర్గం కంటే గొప్పవనీ భావం . ఈ నాటకంలో కవి డా.టేకుమళ్ళ , సరళమైన కథను అల్లుకొనీ, సరళమైన పద్య రచనతో సరస సంభాషణా వైదుష్యంతో తన నేర్పును ప్రదర్శించి, సత్సందేశాన్ని నింపి కేవలం ఐదు రంగాల్లో సమసమాజ నిర్మాణతాస్ఫూర్తితో నిత్య నవ్యత్వం ఆపాదించి నాటకాన్ని సమాప్తి చేశారు.

(ఈ) నాటకం – సుస్పష్టం.ఈ నాటక కవి, రచనా ఉద్దేశాన్ని ముందే స్పష్టం చేశారు. ఐదంకాల కథాసారాంశం స్పష్టపరచారు. ఎక్కడా శబ్ద కాఠిన్యం లేని పద్యరచనా విధానం, మరీ స్పష్టం. కాలానికి తగిన కథా పరికల్పన, ఇంకా స్పష్టం. ఇలా ఈ పద్య నాటకకర్త, ప్రథమాంకంలోనే, దశరథరామయ్య చేత, మస్తాన్ చేత, 1) "రఘు రాముడే కద,/ రహీముగ నాకును" అని ఒకే పద్యంలో రెండు మతాల ప్రార్థన చేయించిన తీరు చాలా బాగుంది. 2) అలాగే, తండ్రీ కొడుకుల సంభాషణ లో "ఎందుకురా, ఈ పర దేశ యాత్ర ?" అంటూ, ...ఇక్కడ లేని భాగ్యముల ? ఇక్కడ లేని సుఖోప భోగమా?" సంభాషణల్లో కూడా ...ఇంక, . ఆంగ్ల పదాలు యథాతథంగా వాడి, ప్రేక్షకునికి దగ్గరయ్యారు. 3) కలవరించు నెపుడు ,కాసులు , లియూరోల? 4) "ఐ.టి.ఐ. నౌక దాని యచ్చట నిర్మించి", ఇలా అన్నీ ఉన్నా, 5) అక్కడక్కడ దీర్ఘ సమాస గంభీర ప్రౌఢిమను కూడా ఇలా ప్రదర్శించిన పద్యం ఇది."క్రూరాస్త్రంబది, భీకరాస్త్రమది, యుగ్రోత్కోషోగ్ర బీభత్స దు/ర్వారోరు ప్రచలత్కరాళవిష కీలాభీల దుష్టాహిసా/కారాస్త్రంబది", ఇలా ... ఫెళ ఫెళార్భటులతో పద్యాన్ని పరుగెత్తించి రసస్ఫూర్తిని రగిలించి డా.టేకుమళ్ళ పద్యరచనా చేవను దృఢత్వాన్ని పలికించారు............ ఇలా....... అన్నీ....... నేనే చెప్పేస్తే, ఎలా? ....మీరూ, తిలకించండి, పులకించండి.

ఉ) చర్వితచర్వణం: డా.వేంకటప్పయ్యగారు అంక కథలతో , వాడిన పద్యాల సంఖ్యతో , వృత్తాదుల పేర్లతో, విశేషాలను ముందే స్పష్టం చేశారు. ఇక నేనేం, చెప్పినా చర్విత చర్వణమే ! రసజ్ఞులు పాఠకులు/ ప్రేక్షకులు నవ్య నాటక విశేషాలు, భవ్యంగా గ్రహించి ఆహ్వానిస్తారని విశ్వసిస్తూ, సహృదయ సామాజిక వరేణ్యులారా! నవ్య నాటక ప్రయోగాలను ఆహ్వానించండి.... ఆదరించండి! ....

విద్వజ్జన విధేయుడు,

కళారత్న ,

డా. మీగడ రామలింగస్వామి.

చరవాణి: 9440189229

అభినందన

కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ

ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ

పూర్వ అధ్యక్షులు



డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య రచించిన "స్వర్గాదాపి గరీయసీ" నాటకం ఆసాంతం చదివాను. ప్రజ-పద్య నాటక బహుమతి ప్రధానోత్సవంలో ముఖ్య అతిధిగా పాల్గొని, ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులు నాద్వారా అందుకున్నవారికి, మా సంస్థ తరపున 25 వేలు, 15 వేలు, 10 వేలు నగదు బహుమతులు ప్రకటించి, మరొక సభలో వారికి నగదును అందజేశాను.

అనేక మార్లు చేసిన విదేశీయానాల ద్వారా, అక్కడి వారితో సంభాషించడం ద్వారా, మనకంటే విదేశాలలో స్థిరపడ్డ వారికే భారతీయ కళల పట్ల గౌరవం అధికంగా ఉందని ఈ సందర్భంగా చెప్పక తప్పదు. పద్య నాటకాల గురించి నేను అమెరికాలో పద్యపఠన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసినదే.

బహుమతి పొందిన నాటకములలో డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య వ్రాసిన ఈ నాటకం ప్రదర్శన యోగ్యంగా భావించాను. భవిష్యత్తులో ఈ నాటకం మాబృందం ప్రదర్శించే విషయంపై ఆలోచించవలసి యున్నది.

పద్యనాటకాలు సాంఘిక ఇతివృత్తంగా గతంలో చింతామణి, వరవిక్రయం వలె ఈ నాటకం కూడా జనాదరణ పొందాలని కోరుకుంటున్నాను.

కళాభినందనలతో

గుమ్మడి గోపాలకృష్ణ

హైదరాబాద్ — చరవాణి: 98480 43079

09-04-2024

అభినందన

దివాకర బాబు మాడభూషి
నాటక, సినీ రచయిత

డా. టేకుమళ్ళ వెంకటప్పయ్యగారికి,

మీరు పంపిన “స్వర్గాదపి గరీయసీ” పద్య నాటకం అందినది “ప్రజ-పద్యం” వారు నిర్వహించిన ఆధునిక పద్య నాటక పోటీలో మీరు ద్వితీయ బహుమతి పొందినందులకు మొదటగా మీకు అభినందనలు తెలియజేస్తున్నాను.

నాటకాలు నేడు పరిషత్తులలో ఇంకా అక్కడకడక్కడా ప్రదర్శింపబడడం వల్ల మాత్రమే ఇంకా బ్రతికి బట్ట కడుతున్నాయన్న మాట యదార్థం. నాటకాలకు ఆదరణ కరువైన రోజుల్లో నాటకాలను బ్రతికించడంకోసం, ముఖ్యంగా నాటక రచయితలను ప్రోత్సాహించడం కోసం పోటీ నిర్వహించడం, అందునా నీతిని తెలియజేసే నాటకాలకు ప్రాధాన్యతనివ్వడం నన్ను మహదానందానికి గురిచేసింది.

మీ నాటకంలో మాతృభూమిని వదలి యువత విదేశాలకేగడం, మనవైన సంగీత, నృత్య కళలపై చూపిన సమస్యలు, పరిష్కారాలు బాగున్నవి. వాస్తవానికి మనదేశంలో కంటే విదేశాలలోనే ఈ సంగీత, నృత్య కళలు ఎక్కువగా పోషింపబడుతున్నాయనడం అతిశయోక్తి కాకపోవచ్చు.

మీ రచనా వ్యాసంగాలన్నీ సాంఘిక మాధ్యమాలలో గమనిస్తూనే ఉన్నాను. మీ సాహిత్యాభిరుచిని, ఆసక్తిని శ్లాఘిస్తూ మీ కృషిని కొనసాగించవలసినదిగా కోరుతున్నాను.

కళాభినందనాలతో!

హైదరాబాదు — దివాకర బాబు మాడభూషి

09-04-2024 — చరవాణి: 98664 77399

పాత్రలు

1.దశరథరామయ్య: వయస్సు 65 సం.లు. భూస్వామి. జుబ్బా, పంచ లేక పైజమా. పైన జరీ కండువా, పల్నాటి యుద్ధంలో బ్రహ్మనాయుడు వంటి బొర్ర మీసాలు ఉంటాయి.

2.రామరాజు: (దశరథరామయ్య పెద్ద కొడుకు) – వయస్సు 28 సం.లు. ప్రథమాంకంలో ప్యాంట్, షర్ట్ తృతీయాంకంలో వేరే ప్యాంట్, షర్ట్, టై , ధరించి ఉండాలి. పైన కోటు, కూలింగ్ గ్లాసులు పెట్టుకుని ఉండాలి. పంచమాంకంలో ప్యాంట్, టీ షర్టు, తైల సంస్కారం లేని జుట్టు.

3.లక్ష్మణరాజు: (దశరథరామయ్య చిన్న కొడుకు) వయసు – 24 సం.లు. ప్యాంటు, షర్టు (ప్రతి అంకంలోను డ్రెస్ మారితే బావుంటుంది. కనీసం షర్ట్ అయినా మార్చాలి)

4.మస్తాన్ సాహెబ్: (దశరథరామయ్య స్నేహితుడు, పొలాల్లో సూపర్వైజర్) – వయసు 65 సం.లు. ముస్లిం అనే గుర్తుగా గడ్డం ఉంటే బావుంటుంది. పొడవు చేతుల తెల్లషర్ట్, పైన ఒక ఆకుపచ్చ చేతుల్లేని ఓవర్కోట్ లాంటిది. వదులుగా ఉండే పైజమా. పాన్ లాంటిది నములుతూ ఉంటాడు.

5.కొండలరాజు: (దశరథరామయ్య బావమరిది) – వయసు 50 సం.లు. రైతు వేషం. పంచ, పొట్టి చేతులున్న తెల్ల షర్ట్. కోరమీసాలు ఉంటాయి.

6.సూర్యనారాయణ: (లక్ష్మణ రాజుకు సహాయకుడు) వయసు – 22 సం.లు. ప్యాంటు, షర్టు.

7.జెన్నా గ్రేసీ లేక జానకి (రామరాజు భార్య) ఆంగ్లేయురాలు – వయసు – 25 సం.లు. తృతీయాంకంలో ఫారిన్ ఫాషనులో స్లీవ్‌లెస్ గౌను, కూలింగ్ గ్లాసులు పెట్టుకుని ఉండాలి. చతుర్థ, పంచమాంకాలలో చీరె, జాకెట్టు, కట్టు, బొట్టు భారతీయ సంప్రదాయంలో ఉండాలి. తెలుగు మాటలు పట్టి పట్టి నిదానంగా ఇంగ్లీషుయాస తో మాట్లాడాలి. (స్వర్ణకమలంలో షరాన్ లోవెన్ , అమెరికా అమ్మాయిలో 'ఆన్నే షేమోటీ' లామాట్లాడాలి)

8.గోపి/ప్రేక్షకుడు: 28–30 సం యువకుడు. మేకప్‌లాంటివి ఏవీ అవసరం లేదు. ప్యాంటు, షర్టు.

కర్టెన్ రైజర్

(తెరలేచే ముందు లోపల నుండి దర్శకుడు
ఈ నాలుగు మాటలు చెప్పవలసి యున్నది)

ప్రేక్షకాళికి నమస్సుమాంజలి. అనాదిగా మన భరతఖండం ఒక ఆధ్యాత్మిక, సామాజిక, వైజ్ఞానిక, ధర్మక్షేత్రం. ఎందరో మహర్షులు ఈ గడ్డపై జన్మించి మనకు వేద వేదాంగాలను, పురాణేతిహాసాలను, ఉపనిషత్తులను అందించి చతుర్విధపురుషార్థాలతో మన జీవనం సుఖవంతంగా సాగేట్టు దీవించారు. ఈదేశం ఎన్నో విదేశీ దండయాత్రలను, మరెన్నో పరాయి పాలనలను ఎదుర్కొన్నప్పటికి, మొక్కవోని దీక్షతో ఈ ఖండంపై ప్రజలు మత, కుల, జాతి వివక్షత లేకుండా కలిసి మెలిసి సహోదరభావంతో జీవనం సాగిస్తున్నారు. మరి నేడు, ప్రపంచీకరణ వల్ల కుటీరపరిశ్రమలు మూతపడ్డాయి. మరోవైపు సర్వ భారతీయ కళలు కుంటినడక నడుస్తున్నాయి. ఆదరణ కరువైంది. పర్యావరణం పడకెక్కింది. ఇలా ఎన్నో సవాళ్ళు ఎదుర్కొంటున్నాం. సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాం.

మనం ఎదుర్కొంటున్న సవాలక్ష సమస్యల్లో మేధోవలస చాలా ముఖ్యమైనది. ప్రతి సంవత్సరమూ లక్షలాదిమంది యువత డాలర్లమోజులో విదేశాలకు తరలి వెళ్తున్నారు. పరదేశాలలో శాశ్వత చిరునామాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్ని దశాబ్దాల అనంతరం మన దేశ పరిస్థితి ఏమిటి? దేశమే నిర్వీర్యమైపోదా? ఈ సమస్యపై స్పందిస్తూ, ఒక ఎడారి కోయిలనై, ఈ "స్వర్గాదపి గరీయసీ" అన్న వైతాళిక గీతాన్ని మీకు వినిపిస్తున్నాను. నాదైన శైలిలో ఓ పరిష్కారాన్ని కూడా అందిస్తున్నాను. తిలకించండి. ఆలకించండి. ఆదరించండి. ఆశీర్వదించండి.

ఇట్లు
నాటక ప్రయోక్త
డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య